క్లుప్తంగా

నేడు పాదాలమ్మ తల్లి జాతర



కొలిమేరులో పాదాలమ్మ ఆలయ ముఖద్వారం

తుని రూరల్: కొలిమేరు గ్రామ దేవత పాదాలమ్మ తల్లి జాతర మహోత్సవం మంగళవారం నిర్వహించేందుకు ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. అమ్మవారి జాతర ఏటా ఆషాఢ మాసం నాలుగో మంగళవారం నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ఆలయానికి రంగులు వేసి, విద్యుద్దీపాలతో అలంకరించారు. మంగళవారం తీర్థం నిర్వహించి, అమ్మవారి దర్శనాలకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

పత్తి సాగులో జాగ్రత్తలు అవసరం

శంఖవరం: రైతులు పత్తి సాగులో జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ పి.గాంధీ సూచించారు. సోమవారం మండలంలోని కత్తిపూడి, శంఖవరం గ్రామాల్లో పత్తి, వరి నాట్లను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పత్తి పొలంలో నిల్వ ఉన్న నీటిని తొలగించాలన్నారు. నీరు ఎక్కువగా ఉన్న పత్తి మొక్కలకు 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వర్షాలు తగ్గాక పత్తి మొక్కల వరుసల మధ్య గొప్పు తవ్వాలని చెప్పారు.

వర్షాలకు కూలిన ఇళ్లు



జి.కొత్తపల్లిలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న వీఆర్‌ఓ వాడపల్లి ప్రసాద్

శంఖవరం: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా జి.కొత్తపల్లిలో దువ్వాకుల దేవుళ్లుకు చెందిన పెంకుటిల్లు, దువ్వాకుల చిన్నోడుకు చెందిన తాటాకిల్లు సోమవారం కూలిపోయాయి. దీంతో బాధిత కుటుంబాలు రోడ్డున పడ్డాయి. సర్పంచ్ ఈగల విజయదుర్గ, వీఆర్‌ఓ వాడపల్లి ప్రసాద్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కిర్లంపూడి: వరి నారుమడుల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల ఏఓ జోకా అమృత తెలిపారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ముంపునకు గురైన పొలాల నుంచి నీటిని తొలగించాలని రైతులకు సూచించారు. పలు గ్రామాల్లో సోమవారం ఆమె పొలాల్లో వరినారుమడులను పరిశీలించారు. నీటిని తొలగించే విధానాలపై అవగాహన కల్పించారు.

తైక్వాండోలో దేవీనాథ్‌కు కాంస్య పతకం



కాంస్య పతకంతో దేవీనాథ్

గండేపల్లి: కాకినాడలో ఈ నెల 21న నిర్వహించిన ఇంటర్ క్లబ్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలలో షణ్ముఖ్ దేవీనాథ్ కాంస్య పతకం గెలుచుకున్నట్టు తైక్వాండో సంఘ జిల్లా కార్యదర్శి బి.అర్జున్ తెలిపారు. ఇతడు కాకినాడలో ఆదిత్య స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. ఆదిత్య యూనివర్సిటీ విద్యాసంస్థల చైర్మన్ ఎన్ శేషారెడ్డి, వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి తదితరులు దేవీనాథ్‌ను అభినందించారు.

తాండవకు జలకళ

- 368.5 అడుగులకు చేరిన నీటి మట్టం
- నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తున్న ఇంజినీరింగ్ యంత్రాంగం



వర్షపు నీటితో కళకళలాడుతున్న తాండవ జలాశయం

కోటనందూరు: అల్పపీడన ప్రభావంతో కొద్ది రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు తాండవ జలాశయంలో నీటిమట్టం క్రమంగా పెరుగుతుంది. జలాశయ గరిష్ట నీటిమట్టం 380 (4.4 టీఎంసీ) అడుగులు కాగా, సోమవారం సాయంత్రానికి ప్రాజెక్టు నీటిమట్టం 368.3 (2.5 టీఎంసీ) అడుగులకు చేరింది. కాగా జలాశయ నీటిమట్టం 370 అడుగులు దాటితే ఆయకట్టుకు నీటి విడుదలకు అనుకూలం. నీటి నిల్వలు 375 అడుగులు దాటితే అదనపు జలాలను తాండవ నది ద్వారా సముద్రానికి విడుదల చేస్తారు. ప్రస్తుతం 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందని తాండవ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియా ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువ వర్షపాతం నమోదు కాకపోవడంతోనే ఇన్‌ఫ్లో తక్కువగా వస్తున్నట్టు వివరించారు. ప్రాజెక్టు డీఈఈ పి.అనురాధ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ యంత్రాంగం జలాశయం వద్ద మకాం వేసి, పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారు.

రోడ్డుపై కూలిన భారీ వృక్షం

జగ్గంపేట: గోకవరం–జగ్గంపేట రోడ్డులో పుష్కర కాలువ సమీపంలో వర్షాలకు భారీ వృక్షం సోమవారం నేలకొరిగింది. దీంతో ఈ మార్గంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జగ్గంపేట సీఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పంచాయతీ, అగ్నిమాపక సిబ్బంది చెట్టును తొలగించే ప్రక్రియ చేపట్టారు. ట్రాఫిక్‌ను మరో మార్గంలో మళ్లించారు. జేసీబీల సాయంతో చెట్టును తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

పోలవరం బ్రిడ్జికి మరమ్మతులు

గోకవరం రోడ్డులో ఉన్న పోలవరం బ్రిడ్జిపై భారీగా గోతులు ఏర్పడడం, వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలువురు ఈ గోతులలో పడి గాయపడ్డారు. దీంతో జగ్గంపేట సీఐ లక్ష్మణరావు బ్రిడ్జిపై నీరు నిలిచిపోకుండా, తాత్కాలికంగా గోతుల పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వర్షాలు తగ్గాక రోడ్డుకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

ముంపులోనే పలు ప్రాంతాలు

ఏలేశ్వరం: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు ప్రాంతాలు ముంపులోనే ఉన్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల ప్రాంగణాలు, రహదారులు, లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం వర్షం కాస్త తెరిపి ఇవ్వడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

రౌతులపూడి: ప్రస్తుతం విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వివిధ దశలలో ఉన్న వరి నారుమడులు ముంపునకు గురయ్యాయి. నారుమడుల్లో విత్తనం చల్లిన మూడు రోజుల వ్యవధిలో, మూడు రోజులకు మించి నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందని, వీలైనంత త్వరగా నీరు తొలగించాలని వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు తెలిపారు. ఆయన గ్రామాల్లో నారుమడులను పరిశీలించారు. నారుమడి మునిగిన ఐదు రోజులలోపు నీరు పూర్తిగా తీసేయాలని, తర్వాత ఐదు సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో పొటాష్ వేయాలన్నారు. ఒక గ్రాము కార్బండిజం, మాంకోజెబ్ పిచికారీ చేయాలని సూచించారు. పిలకల దశలో సాధారణ రకాలు ఐదు రోజుల వరకు మునిగితే, నీరు పోయాక ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ అదనంగా వేయాలని చెప్పారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువలు

గోకవరం: మండలంలో సోమవారమూ భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి జన జీవనం పూర్తిగా స్తంభించింది. ఏజెన్సీలో కురుస్తున్న వర్షాలకు వరద నీరు కాలువల్లోకి వచ్చి చేరడంతో, బురద కాలువ, ఊర కాలువలు ఉధృతంగా ప్రవహించాయి. అలాగే మండలంలోని చెరువులు నిండుకుండల్లా మారాయి. చెరువులు పొంగి పొర్లడంతో సమీపంలోని పొలాలు నీట మునిగాయి. గోకవరం, తంటికొండ, గాదెలపాలెం, కొత్తపల్లి తదితర గ్రామాల్లో పొలాలు ముంపునకు గురయ్యాయి. తంటికొండ గ్రామంలో నీట మునిగిన పొలాలను జేడీఏ ఎస్.మాధవరావు పరిశీలించారు. పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే ముంపు నుంచి పంటను కాపాడుకోవడానికి సూచనలు చేశారు. ఆయన వెంట కోరుకొండ ఏడీఏ మల్లికార్జునరావు, ఏఓ రాజరాజేశ్వరి, ఇతర సిబ్బంది ఉన్నారు.



రౌతులపూడిలో వరి నారుమడిని పరిశీలిస్తున్న ఏఓ రెడ్డి ఈశ్వరరావు



ఏలేశ్వరంలో ముంపులో ఉన్న రహదారి



జగ్గంపేట–గోకవరం రోడ్డులో కూలిన భారీ వృక్షాన్ని తొలగిస్తున్న సిబ్బంది



గోకవరంలో ఉధృతంగా ప్రవహిస్తున్న బురద కాలువ

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు
- గ్రామాల్లో స్వచ్ఛత వారోత్సవాలు

తుని: ప్రస్తుత సీజన్‌లో వర్షాలు కురవడం వలన వ్యాధులు సోకే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు అన్నారు. సోమవారం పురపాలక సంఘం కార్యాలయం నుంచి బాలాజీ సెంటర్ వరకు స్వచ్ఛత అవగాహన ర్యాలీగా వెళ్లి, మానవహారం నిర్వహించారు. పట్టణంలోని వార్డుల్లో కాలువలు శుభ్ర పరిచి బ్లీచింగ్ చల్లారు. వర్షాలు విరివిగా కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ప్రస్తుతం రోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలని సర్పంచ్ గుడాల విజయలక్ష్మి అన్నారు. స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా స్థానిక సచివాలయం వద్ద సోమవారం నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ప్రధాన వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు, సచివాలయ కార్యదర్శి ఫక్కుర్తి శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు. చినశంకర్లపూడిలో నిర్వహించిన స్వచ్ఛత ర్యాలీలో సర్పంచ్ ఏపూరి రామారావు, మాజీ ఎంపీటీసీ మిరియాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



తుని బాలాజీ సెంటర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

అంటువ్యాధులపై అప్రమత్తం

తుని రూరల్: వాతావరణ పరిస్థితుల మార్పు, వర్షాలతో అంటు వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. ఎస్.చామవరం, తేటగుంట, రేఖవానిపాలెం తదితర గ్రామాల్లో స్వచ్ఛత పారిశుధ్య వారోత్సవాలు నిర్వహించారు. ఎస్.చామవరంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ రాము, ఎంపీడీఓ రవికుమార్, లోవ దేవస్థానం మాజీ చైర్మన్ కరపా అప్పారావు పాల్గొన్నారు. అధికారులు, స్థానికులతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఏలేశ్వరం: స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. నగర పంచాయతీ ప్రత్యేకాధికారి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో స్థానిక బాలాజీచౌక్, మెయిన్‌రోడ్ మీదుగా ర్యాలీ జరిగింది. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కమిషనర్ కె.శివప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కోటనందూరులో అవగాహన ర్యాలీ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

మెరుగైన ఆరోగ్యానికి..

కోటనందూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే మెరుగైన ఆరోగ్యం సాధించవచ్చని మండల ప్రత్యేకాధికారి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ రమణారెడ్డి అన్నారు. స్వచ్ఛత వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్‌తో కలిసి స్థానిక జెడ్పీ హైస్కూలు నుంచి బస్టాండు సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండు సెంటర్లో మానవహారంగా ఏర్పడ్డారు. హైస్కూల్లో విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో వ్యాధులు, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మండల వ్యాప్తంగా 17 పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు, విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.

కౌలుదారులకు సీసీఆర్‌సీ తప్పనిసరి

తుని రూరల్: పంట సాగుదారుల హక్కు (సీసీఆర్‌సీ) పత్రాలను కౌలుదారులు తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి.అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం తుని మండలం డి.పోలవరం, సుభద్రయ్యమ్మపేట, కొలిమేరు, కుమ్మరిలోవ తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. వరదలతో ముంపునకు గురైన పొలాలను పరిశీలించారు. మెట్ట ప్రాంతం కావడం, ఖరీఫ్ పనులు చేపట్టకపోవడంతో పంట నష్టం అంతగా లేదన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసే కౌలుదారులు బహుళ ప్రయోజనం పొందేందుకు సీసీఆర్‌సీ కార్డులు తీసుకోవాలన్నారు. దీనివల్ల రాయితీ విత్తనాలు, ఎరువులు, పంటల బీమా, పంట విక్రయంతో పాటు, అతివృష్టి, అనావృష్టి సంభవిస్తే నష్ట పరిహారం లభిస్తుందన్నారు. వరి సాగు చేసే రైతులు దమ్ములు పిల్లి పెసర, జనుము పైర్లను కలియ దున్నాలన్నారు. గిట్టుబాటు ధర బాగున్నందున సాగు నీటి వసతులు లేని భూముల్లో రాగులు సాగు చేయాలన్నారు.



సుభద్రయ్యమ్మపేటలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ అశోక్‌కుమార్

ఆర్టీసీ కార్మికుల నిరసన



తుని డిపో గేటు ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

తుని: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం తుని డిపో వర్క్ షాపు గేటు ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకుడు పిర్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులకు సీనియార్టీ ప్రకారం డిజిటల్ చార్టులు వేయాలని, డ్రైవర్లకు ఓటీకి బదులు ఆర్ఎల్ఓ చార్టు వేయడం, మహిళా కండక్టర్లకు అనుకూలమైన డ్యూటీలు వేయాలని కోరారు. మంగళవారం ఆందోళన కొనసాగిస్తామన్నారు. పలు యూనియన్లకు చెందిన నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రాణ రక్షణకు హెల్మెట్ తప్పనిసరి

ప్రత్తిపాడు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ప్రత్తిపాడు కోర్టు న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కాటం భాను అన్నారు. స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో సోమవారం హెల్మెట్ ధారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాపాయం తప్పుతుందన్నారు. పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి మాట్లాడుతూ హెల్మెట్ ద్విచక్ర వాహన చోదకులకు ప్రధాన రక్షణ ఇస్తుందన్నారు. హెల్మెట్‌తో పాటు, లైసెన్స్, ఆర్‌సీ, ఇన్సూరెన్సు కూడా ఉండాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపే వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు మాట్లాడుతూ హెల్మెట్ పెట్టుకుంటే ఎవరికి వారే రక్షించుకున్నట్టన్నారు. కమిటీ అడ్వకేట్లు బుగత శివ, బొంగుకూరి మధుబాబు, అవసరాల దేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిసింగరాజు కుక్కుటేశ్వరరావు, బార్ ప్రతినిధులు, న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి కాటం భాను

రేపటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

ప్రత్తిపాడు: మండలంలో బాల ఆధార్ ఐదేళ్లలోపు, ఐదు నుంచి ఏడేళ్ల లోపు, 15 నుంచి 17 ఏళ్ల లోపు వారంతా తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీఓ ఎస్ డేవిడ్‌రాజ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆధార్ అప్‌డేషన్ ప్రత్యేక కార్యక్రమం ఈ నెల 23 నుంచి 27 వరకు జరుగుతుందన్నారు. పదేళ్లలో పేరు, చిరునామా, పుట్టిన తేదీల్లో మార్పులు చేయనివారు వారి ఒరిజనల్ గుర్తింపు ధ్రువీకరణ పత్రంతో ఆధార్ శిబిరాల్లో అప్‌డేట్ చేసుకోవాలని కోరారు. ఈ నెల 23, 24 తేదీల్లో ఒమ్మంగి, పోతులూరు, ధర్మవరం, ప్రత్తిపాడు-1లో, 25, 26 తేదీల్లో లంపకలోవ, చింతలూరు, ధర్మవరం జెడ్పీ హైస్కూల్, ప్రత్తిపాడు-2 సచివాలయాల్లో, 27న ఉత్తరకంచి, ఉద్దండ జగన్నాథపురం, ధర్మవరం-3, ప్రత్తిపాడు-3 సచివాలయాల్లో శిబిరాలు జరుగుతాయన్నారు.

వైభవంగా పంచామృతాభిషేకాలు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లకు వైభవంగా పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సోమవారం తిరునక్షత్రం శ్రవణ నక్షత్రం సందర్భంగా 108 కలశాలలో పంచామృతాలు ఉంచి, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు, భక్తులు స్వామిఅమ్మవార్లను, పరివార దేవతలను అభిషేకించారు. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో అభిషేకాలు జరిగాయి.

వాహనాల తనిఖీ

కోటనందూరు: రోడ్డు భద్రతలో భాగంగా కాకరాపల్లి దుర్గమ్మగుడి ప్రాంతంలో ఎస్సై శంకర్ సోమవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వారికి అపరాధ రుసుం విధించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తుని రూరల్: తుని మండలం వి.కొత్తూరులోని ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రసాయన శాస్త్రాన్ని బోధించేందుకు అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆ సబ్జెక్టులో పీజీ చేసి ఉండాలని, ఎన్ఈటీ, ఎస్ఎల్ఈటీ, పీహెచ్‌డీ అదనపు అర్హతలని చెప్పారు. అభ్యర్థులు ఈ నెల 25న తమ ధ్రువపత్రాలతో కళాశాలలో సంప్రదించాలన్నారు.

తొండంగి: పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ మెహర్ సోమవారం తెలిపారు. జువాలజీ, ఎకనామిక్స్ సబ్జెక్టులను బోధించేందుకు పీజీలో 55 శాతం (ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం) మార్కులు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. పీహెచ్‌డీ, ఎంఫిల్ చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు.ఈ నెల 30లోపు అభ్యర్థులు లక్ష్మణుడుపేటలోని డిగ్రీ కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

శిక్షా సప్తాహ్ ప్రారంభం

ప్రత్తిపాడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం శిక్షా సప్తాహ్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని 33 మండల పరిషత్ ప్రాథమిక, ఐదు మండల పరిషత్ ప్రాథమికోన్నత, తొమ్మిది జెడ్పీ హైస్కూళ్లు వెరసి 47 పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలి రోజు ఆయా పాఠశాలల పరిధిలో స్థానికంగా లభించే వనరులను ఆసరాగా చేసుకుని అభ్యసన సామగ్రిని తయారు చేసినట్టు ఎంఈఓ వి.రాజబాబు తెలిపారు.

ప్రత్తిపాడు రూరల్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ వి.రాజబాబు అన్నారు. ఒమ్మంగి జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని సబ్జెక్టులకు సంబంధించిన బోధనోపకరణాలను ప్రదర్శించారు. ఎంఈఓ-2 అచ్చిరాజు, హెచ్‌ఎం వై.వెంకన్న, సీఆర్పీలు పాల్గొన్నారు.

చెక్ పెట్టాల్సిందే..!

- శిథిలావస్థలో సాగునీటి చెక్ డ్యాంలు
- వృథాగా పోతున్న జలాలు
- అధికారుల నిర్లక్ష్యం
- మండిపడుతున్న అన్నదాతలు

రౌతులపూడి: వందలాది ఎకరాల పంటలకు నీరందించే సాగునీటి చెక్ డ్యాంలు అధికారుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రస్తుతమున్న చెక్ డ్యాంలు పూర్తిగా శిథిలావస్థకు చేరి, ఏటా నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏటా పంటలకు సకాలంలో సాగు నీరందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన అప్పటి టీడీపీ ప్రభుత్వం.. నీరు–చెట్టు పథకంలో మంజూరు చేసి, ఆర్భాటంగా చేసిన శంకుస్థాపనలు నేటికీ శిలాఫలకాలుగా దర్శనమిస్తున్నాయి. చెక్ డ్యాంలు మెరుగుపర్చాలని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా, కనీసం పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

వర్షపు నీరూ వృథా..!

చెక్ డ్యాంలు పూర్తిగా శిథిలం కావడంతో ఏటా కొండ కాలువలు, ఏటి కాలువల నుంచి వచ్చే నీరు వృథాగా పోతోంది. ఎగువ ప్రాంతాల్లోంచి వచ్చిన నీటిని పొదుపు చేసేందుకు ఇంకుడు గుంటలు, పారంపాండ్లు అంటూ ఎన్నో నిర్మాణాలకు అప్పటి టీడీపీ ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించింది. అయితే పంటలకు సాగు నీరందించే చెక్ డ్యాంలను మాత్రం విస్మరించిందని రైతులు మండిపడుతున్నారు. రౌతులపూడిలో రైతుల పంట భూములు సాగు చేసుకునేందుకు అవసరమైన బల్లకట్టు, బంగారుకట్టు, ఇసుక కట్టు, సత్రం కాలువ అభివృద్ధికి 2018లో అప్పటి డిప్యూటీ ముఖ్యమంత్రి, హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్పతో వాటి నిర్మాణాలకు శంకుస్థాపనలు కూడా చేశారు కానీ ఏ విధమైన పనులు చేపట్టలేదని సమీప ప్రాంతాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతుల చొరవతో..

మండలంలోని సుమారు 300 ఎకరాలకు సాగు నీరందించే బల్లకట్టు, ఇసుక కట్టు, సత్రం కాలువ గట్టు, పి.చామవరంలోని గుర్రపు చెరువు చెక్ డ్యాం, మద్దిల చెరువు చెక్ డ్యాం, బలరామపురంలో వెంకమ్మ చెరువు పొర్లుడ్యాం(దెయ్యాల కట్టు), ఎ.మల్లవరంలో ఎర్ర చెరువు గట్టు పొర్లు డ్యాం, సబ్ ప్లాన్ ఏజెన్సీలోని జల్దాం, రాఘవపట్నం, సార్లంక గ్రామాల్లో సుమారు 25 ఏళ్ల క్రితం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్మించిన ఏటి కాలువ చెక్ డ్యాంలు పూర్తిగా శిథిలమయ్యాయి. కొన్నిచోట్ల అవసరమైన మేరకు రైతులే స్వచ్ఛందంగా శ్రమదానం చేసి, తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిల చెక్ డ్యాంలను శాశ్వత ప్రాతిపదికన పటిష్ట చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



బలరామపురంలో శిథిలావస్థలో ఉన్న వెంకమ్మ చెరువు స్లూయిజ్ (దెయ్యాల కట్టు)



రౌతులపూడిలో సత్రం కాలువ మరమ్మతులకు శ్రమదానం చేస్తున్న స్థానిక రైతులు(ఫైల్)

పట్టించుకున్న వారే లేరు



సుమారు 300 ఎకరాలకు సాగు నీరందించే ఎర్ర చెరువు పొర్లు డ్యాం పూర్తిగా శిథిలమైంది. పొర్లు డ్యాంను బాగు చేయాలని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న వారే లేరు. పొర్లు డ్యాం శిథిలం కావడంతో ఏటా చెరువుకు చేరిన నీరు వృథాగా పోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చెక్ డ్యాంలను నిర్మించాలి.

– కాకి నాని, రైతు, ఎ.మల్లవరం, రౌతులపూడి మండలం

వాటిని పరిశీలిస్తాం



మండలంలోని శిథిలావస్థలో ఉన్న సాగునీటి చెక్ డ్యాంలను సంబంధిత ఇరిగేషన్, వ్యవసాయ అనుబంధ సంస్థల అధికారులతో కలసి పరిశీలించి, వాటి అభివృద్ధికి చర్యలు చేపడతాం. వీటిపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదించి, అవసరమైన మేరకు శాశ్వత ప్రాతిపదికన పటిష్ట చర్యలు చేపడతాం.

– ప్రేమ్‌సాగర్, ఎంపీడీఓ, రౌతులపూడి